

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు.. అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!

సంపుటి:-01, సంచిక:-132, బుధవారం 07-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

కష్టమైన దశ దాటేశారు.. ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఇక దూకుడే!



- ఎస్ఎల్‌బీసీ పనుల్లో కీలక ముందడుగు
- క్లిష్టమైన షియర్ జోన్‌ను అధిగమించిన కార్మికులు
- సొరంగం పనులు 79 శాతం పూర్తి
- ఐదు నెలల్లో 700 మీటర్ల తవ్వకాలు
- 2028 జూన్ నాటికి నీటి విడుదల లక్ష్యం

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కీలక ముందడుగు పడింది. తవ్వకాలకు తీవ్ర ఆటంకంగా మారిన క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాన్ని - మిగతా 2 లో

ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు



- ప్రత్యేక పాలసీకి తెలంగాణ సర్కార్ ప్లాన్
- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు తెలంగాణ కీలక చర్యలు
- ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి
- అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన
- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు - మిగతా 2 లో

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న "నేహా బోరా"

ఆమె విద్యార్థి రాజకీయ ప్రయాణం ఎందుకు అంత ప్రత్యేకం



29 ఏళ్ల నేహా బోరా ఉత్తరాఖండ్‌కు చెందిన యువ విద్యార్థి నాయకురాలు. ఆమె తండ్రి భారతీయ సైన్యంలో అత్యున్నత హోదాలో (ఆర్మీలో ఉన్నత అధికారిగా) దేశానికి సేవ చేసిన వ్యక్తి. మిలిటరీ నేపథ్యం, నుంచి వచ్చినప్పటికీ సమాజంలోని అసమానతలను, ప్రభుత్వాల వైఫల్యాలను ప్రశ్నించే దృక్పథాన్ని నేహా ఎంచుకున్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేశారు. ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో థియేటర్ అండ్ పెర్ఫార్మెన్స్ విభాగంలో గ్రామ్ష రీసెర్చ్ స్కాలర్‌గా కొనసాగుతున్నారు. విద్యార్థి దశలోనే థియేటర్ ద్వారా సామాజిక సమస్యలపై గళం ఎత్తిన ఆమెకు, ఒక పొలిటికల్ థియేటర్ గ్రూప్ ద్వారా వామపక్ష ూ×ూూతో పరిచయం ఏర్పడింది. అక్కడి నుంచి విద్యార్థి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆమె, 2019లో జూూ వ్యతిరేక ఉద్యమాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారు. దేశాన్ని కుదిపేస్తున్న పేపర్ లీకులు, పరీక్షల పారదర్శకత లోపాలు, తీవ్రమైన నిరుద్యోగం , విద్యా వ్యవస్థ వైఫల్యాలపై ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. జంతర్ మంతర్ వద్ద ఏకంగా 23 రోజుల పాటు అసాధారణమైన నిరాహార

ముంబైలో ప్రజా నిరసన వెల్లువ.. జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్!



ముంబై శివాజీ పార్క్‌లో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన చేపట్టారు. ూ×= ప్రక్రియ, ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వేలాది మంది ఆందోళనలో పాల్గొన్నారు. నిరసనకు వివిధ వర్గాలు, సంస్థలు మద్దతు తెలిపాయి.

జ్ఞానేష్ కుమార్‌పై సుప్రీంకోర్టులో కీలక విచారణ

ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కాదని ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, సస్పెండ్ చేయాలని పిటిషనర్ వాదన. మధ్యంతర ఉత్తర్వులకు ధర్మాసనం నిరాకరణ.. కానీ జజుజ, ఇద్దరు కమిషనర్లు, కేంద్ర న్యాయ శాఖకు నోటీసులు జారీ చేసి వివరణ కోరిన సుప్రీంకోర్టు.ఓట్ల సవరణ పేరుతో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అమలు తీరు, రాజ్యాంగం గుండెలను బల్లెంతో పొడిచినట్టు ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, కోట్లాది మంది పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమని ఇటీవల అక్టోబర్ 2026లో - మిగతా 2 లో

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా - మిగతా 2 లో

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు



- మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం
- పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎంపీ లింగమనేని రమేశ్ పూజల నిర్వహణ
- అమ్మవారికి విశిష్టమైన ఖడ్గమాల అర్చన జరపనున్న ఎంపీ
- ప్రధానికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్ష

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని - మిగతా 2 లో

వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్

మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్'

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరోత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో

వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?



- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార' పథకం
- ప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- 90 లక్షల కుటుంబాలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- రాయలసీమను హార్టికల్చర్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని హామీ
- వివేకా హత్య, లిక్కర్ స్కామ్, ఇసుక కుంభకోణాలపై గొడ్డలి పార్టీ అధినేత సమాధానం చెప్పాలని డిమాండ్ - మిగతా 2 లో


భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభతరం చేయాలి
- అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం అందించాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచకుండా, - మిగతా 2 లో

సీఎం రేవంత్, నటిపై అసభ్య పోస్టులు

- సీఎం రేవంత్, నటి సురేఖావాణిపై అసభ్యకర పోస్ట్
- 'డిగ్‌టీవీ తెలుగు' ప్యారడీ ఎక్స్ ఖాతాపై కేసు
- సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత
- సీఎం ప్రతిష్ఠకు, నటి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న "నేహా బోరా"

మొదటిపేజీ తరువాయి – దీక్ష చేపట్టడంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. నిన్న ఢిల్లీలో ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం జరిగిన నిరసనలో పోలీసులు ఆమెను చుట్టూ ముట్టి బలవంతంగా అరెస్ట్ చేయాలని ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డి ప్రయత్నించింది. పోలీసులు ఆమెను అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. కానీ ఆమె చూపిన అసాధారణ తెగింపు, పోరాట పటిమ ముందు పోలీసుల బలప్రయోగం తేలిపోయింది. ఆ ధైర్యం చూసి చివరకు పోలీసులే వెనకడుగు వేయాల్సి వచ్చింది. అధికార బలంతో ఎవరినైనా అణచివేయవచ్చనే అహంకారానికి, భయపడని ఒక యువత స్వరం ఎలా ఎదురునిలుస్తుందో నేహా బోరా నిరూపించారు. థియేటర్ వేదిక నుంచి విద్యార్థి ఉద్యమ రణరంగం వరకు ఆమె సాగిస్తున్న ఈ ప్రయాణం నియంతత్వ పోకడలను ధైర్యంగా ఎదిరించే ప్రతి ఒక్కరికీ ఆమె ప్రయాణం గొప్ప స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

ముంబైలో ప్రజా నిరసన వెల్లువ.. జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్!

మొదటిపేజీ తరువాయి – హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ కార్యక్రమంలో తీవ్రంగా విమర్శించారు. నల్సార్ యూనివర్సిటీ లో ప్రధాన ఉపన్యాసం చేస్తూ ఆయన ఘాటైన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రశ్న అడిగితే సమాధానం చెప్పకుండా , ప్రశ్నకు విమర్శను అస్త్రంగా స్పందించే విధానం మంచిది కాదని కేంద్ర ప్రభుత్వానికి సూచన చేశారు. లక్షల మంది కోట్ల మంది ఓట్లను ఏకపక్షంగా తొలగించడం దీనిని కూడా ఒక వ్యతిరేకమైన రాజ్యాంగ సవరణ ద్వారా, ఆదేశం ద్వారా చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నేరుగా రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను, ప్రజాస్వామ్య వ్యవస్థను కూల్చే విధంగా తయారు చేసిందని దీనికి ఏ సమాధానం సమంజసం కూడా కాదని స్పష్టం చేశారు.

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

మొదటిపేజీ తరువాయి – తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

సీఎం రేవంత్, నటిపై అసభ్య పోస్టులు

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినీ నటి సురేఖావాణిని కించపరిచేలా సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టు తీవ్ర వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది కైలాశ్ సజ్జన్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'డిగ్‌టీవీ తెలుగు (డిగ్‌టీవీ ప్యారడీ)' పేరుతో ఉన్న ఓ ఎక్స్ ఖాతాలో సీఎం రేవంత్ రెడ్డి, నటి సురేఖావాణి చిత్రాలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన వ్యాఖ్యలతో పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్ట్ ఉద్దేశపూర్వకంగా ముఖ్యమంత్రి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయడంతో పాటు, ప్రభుత్వంపై ప్రజల్లో ద్వేషాన్ని రెచ్చగొట్టేలా ఉందని ఆరోపించారు. అలాగే ఒక మహిళా నటి గౌరవానికి భంగం కలిగించేలా ఈ చర్యకు పాల్పడ్డారని కైలాశ్ సజ్జన్ తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. సీఎంను అవమానించడంతో పాటు, నటిని కించపరిచేలా ఉన్న ఈ పోస్టుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదు స్వీకరించిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు సంబంధిత ఎక్స్ ఖాతా నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించి, నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు.ద

కష్టమైన దశ దాటేశారు.. ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఇక దూకుడే!

మొదటిపేజీ తరువాయి – అధిగమించారు. దీంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైంది. అదనపు యంత్రాలను అందుబాటులోకి తెచ్చి పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2028 జూన్ నాటికి సొరంగం ద్వారా నీటిని అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి ఆదివారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ సహా కీలక సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సొరంగం పూర్తయితే కరవు పీడిత ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీరు అందనుంది. సొరంగం మొత్తం పొడవు 43.968 కిలోమీటర్లు కాగా, ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. గత ఐదు, ఆరు నెలల్లో ఇన్‌లెట్, ఔట్‌లెట్ మార్గాల్లో కలిపి సుమారు 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. అత్యంత క్లిష్టమైన షియర్ జోన్‌ను దాటడం ఈ పురోగతిలో కీలకమని మంత్రి పేర్కొన్నారు. సొరంగం తవ్వకాల సమయంలో గతేడాది ఫిబ్రవరిలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బలహీనమైన భూభాగం, రాళ్లు విరిగిపడే ప్రమాదాలున్న చోట ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేశారు. 140 మిల్లీమీటర్ల మందం కలిగిన పైపులతో రక్షణ కవచం ఏర్పాటు చేసి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సగటున ఏడు నుంచి ఏడున్నర మీటర్ల మేర తవ్వకాలు జరుగుతున్నాయి. ఔట్‌లెట్ వద్ద మూడు చేతుల డ్రిల్లింగ్ యంత్రం పనిచేస్తుండగా, అక్టోబరులో ఇన్‌లెట్ వద్ద మరో యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. జర్మనీ నుంచి తెప్పిస్తున్న ప్రత్యేక రైలు ఈ నెలాఖరుకు చేరుకోనుంది. దీంతో సొరంగం లోపల తవ్విన మట్టిని, రాళ్లను వేగంగా బయటకు తరలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఒక విడత తవ్వకాల పనులు పూర్తి కావడానికి 20 నుంచి 24 గంటలు పడుతోంది. కొత్త యంత్రాలు, మెరుగైన రవాణా సదుపాయాలతో ఈ సమయాన్ని పది గంటలకు తగ్గించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్టోబరు చివరి నుంచి పనుల్లో మరింత వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

మొదటిపేజీ తరువాయి – పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?

మొదటిపేజీ తరువాయి – ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు.

గ్రామీణ తాగునీటి కష్టాలకు 'అమరజీవి జలధార'తో చెక్

సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.

రాయలసీమ దశ మార్చేస్తాం.. రత్నాల సీమగా తీర్చిదిద్దుతాం

రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి" అని అన్నారు. "రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి

కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు.

గొడ్డలి పార్టీకి సూటి ప్రశ్నలు.. ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలి

ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?" అని నిలదీశారు. "ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు.

ప్రొద్దుటూరుకు వరాలు.. స్థానిక సమస్యలకు పరిష్కారం

స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు

చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోదీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన ప్రజల ఉత్సాహాన్ని చూసి, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతా కీ జై, తెలుగు తల్లికి జై" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

మొదటిపేజీ తరువాయి – ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా సమావేశానికి రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ లతో కలిసి హాజరై



ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్,

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు, మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఖానాపూర్, ముథోల్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, ప్రజలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, భూ సంబంధిత అంశాలు, గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ భూములకు సంబంధించిన రికార్డులలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనంత మేరకు సేవలను సులభతరం చేయాలని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి జిల్లాలో కొనసాగుతున్న భూ పరిపాలన, భూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారం, భూ సంబంధిత దరఖాస్తుల స్వీకరణ--పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు, భూ రికార్డుల నవీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్ సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, క్షేత్రస్థాయి పురోగతిపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలు, రికార్డులలో మార్పులు, హక్కుల నమోదు, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందేలా చర్యలు చేపట్టాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక, గృహాల మంజూరు, నిర్మాణ ప్రారంభం, వివిధ దశలలో ఉన్న ఇండ్ల సంఖ్య, నిర్మాణాలు పూర్తి కాని కారణాలు, పెండింగ్‌లో ఉన్న గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఇప్పటికే మంజూరైన గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, నిర్మాణాలు ప్రారంభం కాని ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గృహ నిర్మాణాల పురోగతిని గ్రామ, మండల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన మార్గదర్శకత్వం, శాఖల మధ్య సమన్వయం అందించాలని సూచించారు. నిర్మాణాలు వివిధ దశలలో నిలిచిపోయిన చోట సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాల వారీగా భూ సమస్యల పరిష్కారం, రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి జిల్లాలో ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, ముఖ్యంగా పేదలు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలతో పాటు అవసరమైన చోట అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేలా ప్రతి శాఖకు స్పష్టమైన కార్యాచరణ ఉండాలని, పెండింగ్‌లో ఉన్న పనులు, దరఖాస్తులు, నిర్మాణాలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా అమలవుతున్నందున, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని తెలిపారు. అంతకుముందు నిర్మల్ జిల్లాలోని బాసర ప్రాంతంలో గోదావరి పుష్కరాలకు సంబంధించి రహదారుల అభివృద్ధి పనులు, లోకేశ్వరం మండల కేంద్రం, దస్తురాబాద్ మండలం గొడిసెరాల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు

మొదటిపేజీ తరువాయి – చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు. విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని



సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్



మొదటిపేజీ తరువాయి – ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడోప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు. ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

కైసర్ నగర్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

శంఖుస్థాన చేసిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,దుద్దిళ్ల శ్రీధర్ బాబు





కుత్బుల్లాపూర్,అక్టోబర్06(విజన్ పక్షం దినపత్రిక): పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఇందిరమ్మ టవర్స్" నిర్మాణానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ పరిధి కైసర్ నగర్ లో రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల కేబినెట్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. డీసీసీ తోటకూర వజ్రేష్ యాదవ్,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మంత్రులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...పేదల సొంతింటి కలను నెరవేర్చేలా కైసర్ నగర్‌లో నాలుగు టవర్స్ తో కూడిన 480(నాలుగు వందల ఎనభై)గృహాలు పేద కుటుంబాలకు అందుబాటులోకి రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాబోతుండడం సంతోషకరంగా ఉందన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రులు కొందరు లబ్ధిదారులకు ఇంటి పత్రాలను పంపిణీ చేశారు. కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పేదలకు వరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని కొనియాడారు.ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తై, అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతం(ఐఏఎస్)జిల్లా కలెక్టర్ మనోచౌదరి(ఐఏఎస్),మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ,మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు అజయ్,చరణ్ కౌశిక్ , గ్రంథాలయ చైర్మన్ శ్రీ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి ,టీపీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిశోరె రెడ్డి, జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నెం రాజు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు,మైనారిటీ నాయకులు,ఎన్ఎస్యూఐ,ఐఎన్టీయూసి నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సురారం కాలనీలో నిషేధిత భూముల జాబితాలో ఉన్న స్థలాలను 22ఎ నుండి తొలగించమంటూ మంత్రికి వినతి



కుత్బుల్లాపూర్,అక్టోబర్06(విజన్ పక్షం దినపత్రిక): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సురారం కాలనీలోని సర్వే నెం.107,49 నంబర్లు నిషేధిత భూముల(22ఎ) జాబితాలో ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పై రెండు సర్వే నంబర్లను (22ఎ)జాబితా నుంచి తొలగించి అక్కడి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ.కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పీ.వివేకానంద్,స్థానిక మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనుల భూమి పూజకు విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించాలని ఆయనను కోరారు.మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ,కొలుకుల జగన్,ఎం.డి. రఫీ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ప్రజల సమస్యను మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు.

వినతి పత్రంతో కదిలిన యంత్రాంగం

రంగంలోకి కమిషనర్

వినతి పత్రంపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ పింకేశ్ కుమార్.

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ

బస్ షెల్టర్ ల నిర్మాణం కోసం ఏర్పాటు స్థలాలని పరిశీలించిన అధికారులు

వెంటనే స్పందించిన కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపిన కోలా





సురారం,అక్టోబర్06(విజన్ పక్షం దినపత్రిక): సురారం కాలనీ వాసులు బస్సు షెల్టర్ లేక, ప్రధాన రహదారిపై బస్సు స్టాప్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ యువ నాయకులు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నాడు జోనల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ పింకేశ్ కుమార్ ని కలిసి వినతి పత్రం అందజేశారు.సూరారం సాయిబాబా నగర్ చౌరస్తా,సాయిబాబా నగర్ మెయిన్ రోడ్,సూరారం మెయిన్ రోడ్ వద్ద బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇచ్చిన వినతిపై జోనల్ కమిషనర్ స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు కోలా శ్రీకాంత్.నేడుసాయిబాబా నగర్ బస్ స్టాప్,సూరారం మెయిన్ రోడ్ బస్ షెల్టర్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలని అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు సరైన షెల్టర్ లేకపోవడం,కొన్ని సార్లు బస్సులు ఆపకుండా వెళ్లిపోతుండడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.త్వరలో ప్రయాణికులు ఇబ్బందులు తీరుతాయని ఆకాంక్షించారు బీఆర్ఎస్ శ్రేణులు, స్థానికులు.ప్రజా సమస్యలపై తాము నిరంతరం తమ గళాన్ని విప్పి పోరాడతామని కోలా శ్రీకాంత్ అన్నారు. కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి,విక్రమ్,ప్రసాద్,ప్రశాంత్ రెడ్డి, డేవిడ్, యుగేందర్,అనిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ కోపరేటివ్ సొసైటీలో భారీ అక్రమ షెడ్డుల నిర్మాణం

- పట్టించుకోని పట్టణ ప్రణాళికా అధికారులు
- పట్టణ ప్రణాళిక కనుసన్నల్లోనే భారీ నిర్మాణాలంటూ పెద్దయెత్తున విమర్శలు
- అనుమతులు లేవంటూ కూల్చివేసిన షెడ్డులు యధావిధిగా మళ్ళీ నిర్మాణాలు
- నిర్మాణ దారులకు కొమ్ముకాస్తుంది టౌన్ ప్లానింగ్ అధికారులేనంటూ పలువురు వాదనలు
- కొంపల్లి సర్కిల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక అధికారుల దొంగాట
- చైన్ మెన్లే అధికారుల పాసుపతాస్త్రం
- నిర్మాణదారులు అధికారుల్ని కలిస్తే ఒక లెక్క,లేకుంటే ఇంకో లెక్క
- భారీ అక్రమ షెడ్డులు,భారీ నిర్మాణాలే టౌన్ ప్లానింగ్ అధికారుల అసలు టార్గెట్
- అక్రమ నిర్మాణాలను ఉపేక్షించని అధికారులు భారీ షెడ్డులపై చర్యలకు ఎందుకు కాలయాపన



ఎస్వీ కోపరేటివ్ సోసిటీలో భారీ షెడ్డు నిర్మాణం




రామిరెడ్డి నగర్ లాస్ట్ బస్ స్టాప్ వద్ద భారీ షెడ్డు నిర్మాణం

కొంపల్లి,అక్టోబర్06(విజన్ పక్షం దినపత్రిక): కొంపల్లి సర్కిల్ పరిధి జీడిమెట్ల పారిశ్రామికవాడ శ్రీ వెంకటేశ్వర కోపరేటివ్ సొసైటీలో(ఎస్వి కోపరేటివ్),రామిరెడ్డి నగర్ లాస్ట్ బస్ స్టాప్,పైపు లైన్ రోడ్డులో క్లాసిక్ బార్ అండ్ రెస్టారెంట్ కి అనుకుని ఇష్టారీతిన అక్రమంగా భారీ షెడ్డుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎలాంటిఅనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నా పట్టణ ప్రణాళిక అధికారుల్లో చలనం లేకపోవడం ఇప్పుడు తీవ్ర చర్చాంసనీయంగా మారింది. ఎన్ని విమర్శలు వస్తున్నా నవ్విన నాపచేనే పండును నాకేంటి అనే ధోరణిలో ఉన్నారు కొంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారు మాత్రం.ఒకవైపు అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని అధికారులు పైకి డాంబికాన్ని ప్రదర్శిస్తూ కూల్చివేతలు చేపడుతుంటే ఇంత దర్జాగా అక్రమ షెడ్డుల పర్వం కొనసాగుతూనే ఉంది.అనుమతులు లేకుండా భారీ ఎత్తున నిర్మాణాలు కొనసాగడం వెనుక కొంపల్లి పట్టణ ప్రణాళిక విభాగంలోని కొందరు అధికారులు కొమ్ముకాస్తున్నారనే వాదనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న భారీ షెడ్డుల నిర్మాణం వెనుక ఉన్నదెవరు అధికారులా పవరా? లేక పొలిటికల్ పవరా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి ప్రజలలో.అధికారులు నిర్మాణదారులుతో అంటకాగుతూ ప్రభుత్వ(బల్దియా) ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. సామాన్యుడు కట్టుకునే చిన్నా చితకా నిర్మాణాల వద్దకు ఆగమేఘాల మీద వచ్చి వాటిని కూల్చి వేస్తున్న పట్టణ ప్రణాళిక అధికార యంత్రాంగం భారీ నిర్మాణాలు,భారీ అక్రమ షెడ్డుల విషయంలో చర్యలు తీసుకోవడానికి కాలయాపన ఎందుకు చేస్తున్నారో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.కొంపల్లి సర్కిల్ లోనే సుభాష్ నగర్,రామిరెడ్డి నగర్ వివిధ కాలనీలలో అక్రమ నిర్మాణాలు అని అనేక భవనాలను,షెడ్డులను ఇటీవలే పాక్షికంగా కూల్చి వేసారు అధికారులు.కూల్చివేతలు జరిగిన వెంటనే ఆయా నిర్మాణాలన్ని యధావిధిగా నిర్మాణాలు పూర్తిచేసేసారు నిర్మాణ దారులు.మరి ఇలాంటి నిర్మాణాలను అధికారులు ఎందుకు ఉపేక్షిస్తున్నారంటూ స్థానికులు వాపోతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ని ఉన్నత స్థాయి అధికారులు నిర్మాణ దారులతో భేరసారాలు కుదుర్చుకుని నిర్మాణ పటిష్టత ఏమాత్రం దెబ్బతినకుండా నిర్మాణ దారుడితో డీల్ కుదిరేలా గోడలకు కన్నాలు పెట్టి అనుమతులు లేని భవనాలను పాక్షికంగా కూల్చివేసాము అని ఫోటోలకు ఫోజులు ఇచ్చి చేతులు దులుపుకుని అమ్యామ్యాలు ముట్టినాక యధావిధిగా నిర్మాణం చెపట్టుకొనేందుకు పట్టణ ప్రణాళిక విభాగ యంత్రాంగమే అక్రమ నిర్మాణ దారులకు వెన్నుదన్నుగా ఉంటుందనే వాదన బలంగా వినిపిస్తోంది. అధికారులు కూల్చివేశామని ప్రకటించిన సదరు భవనాలన్ని నేడు మళ్ళీ యధావిధిగా నిర్మాణ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికైనా కొంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక అధికార యంత్రాంగం ఆడుతున్న దొంగాటకు ఉన్నతాధికారులు చెక్ పెడతారని సర్కిల్ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.. అక్రమంగా నిర్మాణమవుతున్న భారీ షెడ్డులపై అధికారులు చిత్తశుద్ధి ఎలా పనిచేస్తుందో వేచి చూడాలి.



పైపులైన్ రోడ్డులో భారీ షెడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బాలాపూర్ , అక్టోబర్ 6(విజన్ పక్షం): కాలనీల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. జిహెచ్ఎంసి మీర్‌పేట్ 60వ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం మెయిన్ రోడ్డు నుండి ధాతు నగర్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి మంజూరైన రూ. 16.5 లక్షల సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... సీసీ రోడ్డు నిర్మాణంతో కాలనీవాసులకు, వాహనదారులకు రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ (మాజీ కార్పొరేటర్, 16వ వార్డు), ఎనుగుల అనిత అనిల్ యాదవ్ (జిల్లెలగూడ మాజీ ఎంపీటీసీ), అర్కల భూపాల్ రెడ్డి (మాజీ ఫ్లోర్ లీడర్), అర్కల కామేష్ రెడ్డి (మాజీ అధ్యక్షుడు), మాజీ కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, ధనలక్ష్మి రాజ్ కుమార్, మాదారి సురేఖ రమేష్, లార్డ్స్ సిద్దాల బీరప్ప, గడ్డమీది రేఖ లక్ష్మణ్ ముదిరాజ్, కమిటీ సభ్యులు నాయకులు మాజీ టెంపుల్ డైరెక్టర్లు మేకల యాదగిరి, బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వర్ చారి, గోపి యాదవ్, బొమ్మకంటి దయానంద్ ముదిరాజ్, సిరూర్ బాల్ రాజ్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, హాథీరాం నాయక్, శ్రీనివాస్ గుప్తా, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ నాయక్, మహిళా అధ్యక్షురాలు జమాల్పూర్ సునీత, మాజీ కో-ఆప్షన్ సభ్యులు పల్లె జంగయ్య గౌడ్, కర్రి వెంకటేష్ కుర్మా, హాము నాయక్, లప్ప లక్ష్మణ్. ప్రభాకర్ రెడ్డి (ధాతునగర్ కాలనీ అధ్యక్షుడు), మునగాల ప్రేమ్ కుమార్ (శ్రీ సాయి కృపా నగర్ కాలనీ అధ్యక్షుడు), మన్నెం రెడ్డి (జయభారత్ నగర్ కాలనీ అధ్యక్షుడు)తో పాటు వివిధ కాలనీల ప్రజలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కనీస వేతనాలు చెల్లించి పర్మినెంట్ చేయాలి --- సీఐటీయూ

నందిగామ: **అక్టోబర్06(విజన్ పక్షం దినపత్రిక):** ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, వారిని పర్మినెంట్ చేయడంతో పాటు అన్ని రకాల సెలవులు, ప్రయాణ ఖర్చులు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నందిగామలో ర్యాలీ నిర్వహించారు. నందిగామ గాంధీ సెంటర్ నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లిన ఆశా వర్కర్లు, అనంతరం ఎమ్మెల్యేకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.గోపాల్, కంచికచర్ల మండల నాయకులు గోపినాయక్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి సుమారు ఏడేళ్లు అవుతోందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. సుమారు 20 ఏళ్లుగా ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు సరైన సెలవులు లేకపోవడంతో వారు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. అంగన్వాడీ సిబ్బందికి అమలు చేస్తున్న విధానంలో వేసవి సెలవులు మినహా వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు, పండుగ సెలవులు, క్యాజువల్ లీవ్స్, మెడికల్ లీవ్స్ వంటి అన్ని రకాల సెలవులను ఆశా వర్కర్లకు కూడా అమలు చేయాలని కోరారు.ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.10 వేలలోనే పీహెచ్‌సీలు, ఆసుపత్రులకు వెళ్లేందుకు నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతోందని వారు పేర్కొన్నారు. తమ విధులకు సంబంధం లేని పనులు అప్పగించడం, అధిక జనాభా పరిధిలో పనిచేయాల్సి రావడం వల్ల ఆశా వర్కర్లు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రధాన డిమాండ్లు ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించి పర్మినెంట్ చేయాలి. వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు, పండుగ సెలవులు, క్యాజువల్ లీవ్స్, మెడికల్ లీవ్స్ సహా అన్ని రకాల సెలవులు కల్పించాలి. దహన సంస్కారాల ఖర్చులు చెల్లించాలి. ఆశా వర్కర్ల నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్యను పెంచాలి.పీహెచ్‌సీకి వెళ్లే ప్రతి సందర్భంలో టీఏ, డీఏ చెల్లించాలి. ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పొందిన ఆశా వర్కర్లకు పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలి. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. నాణ్యమైన మొబైల్ ఫోన్లు, యూనిఫామ్ అందించాలి.గ్రాట్యుటీపై ఉన్న సీలింగ్‌ను ఎత్తివేయాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలి. కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గం లోని వివిధ పీహెచ్‌సీల ఆశా వర్కర్ నాయకులు ఎం. తిరుమలదేవి, కె.మార్తమ్మ, కవిత, నాగమణి, కమల, రాణి, పుల్లమ్మ, గోవిందమ్మ, రోజ్ మేరీ, జమలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలి

బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్



కుత్బుల్లాపూర్ జోన్, అక్టోబర్06(విజన్ పక్షం దినపత్రిక): గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాన చేసారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద పాల్గొన్నారు.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సముదాయల భూమిపూజ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ. ఇందిరమ్మ ఇళ్ల పేరిట తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఇళ్ల సముదాయాలలోని లబ్ధిదారులకు ఇండ్లను కట్టించి ఇవ్వడమే కాదు, మౌలిక వసతులను కల్పించడంతో పాటు ప్రార్థన మందిరాలకు,వైకుంఠ ధామాల కోసం స్థలాలను కేటాయించి అభివృద్ధిపరిచేలా హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్,స్థానిక మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించాలని సూచించారు.... కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హార్ట్ ఎటాక్ వచ్చే 30 రోజుల ముందు ఈ సంకేతాలు, లక్షణాలు కనిపిస్తాయి జాగ్రత్త పడండి



ప్రస్తుత తరుణంలో చాలా మంది గుండె పోటుతో మరణిస్తున్నారు. ఒకప్పుడు కేవలం వయస్సు పైబడిన వారు మాత్రమే గుండె పోటు బారిన పడేవారు. కానీ ఇప్పుడు అలా కాదు. చిన్న వయస్సులో ఉన్నవారు కూడా హార్ట్ ఎటాక్, కార్డియాక్ అరెస్ట్, హార్ట్ ఫెయిల్యూర్‌తో ఉన్నట్లుండి కుప్పకూలి చనిపోతున్నారు. ఇవి జరగడానికి ముందే వచ్చే సంకేతాలను చాలా మంది గమనించడం లేదు. దీంతో అనర్థం జరుగుతోంది. ఈ మధ్య కాలంలో యుక్త వయస్సులో ఉన్నవారు ఇలా చనిపోవడం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. అయితే హార్ట్ ఎటాక్ లేదా కార్డియాక్ అరెస్ట్, హార్ట్ ఫెయిల్యూర్ అవడానికి ముందే మన శరీరం మనకు కొన్ని సూచనలను, సంకేతాలను ఇస్తుంది. వాటిని గుర్తించడం ద్వారా ఎలాంటి అనర్థం జరగకుండా మనం ముందుగానే పసిగట్టి చికిత్స తీసుకోవచ్చు. దీంతో ప్రాణాలను నిలుపుకోవచ్చు.

కళ్ల కింద వాపులు..

హార్ట్ ఎటాక్ వచ్చే ముందు కొందరిలో పలు లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా నిద్రలేమి సమస్య ఉంటుంది. అసలు ఏమాత్రం నిద్ర పట్టదు. దీంతో కళ్లు వాపులకు గురవుతాయి. గుండె నుంచి రక్తం సరఫరా సరిగ్గా జరగకపోతే ఇలా జరుగుతుంది. అయితే కేవలం నిద్రలేమి సమస్యనే అయితే సరిగ్గా నిద్రపోతే ఈ లక్షణం నుంచి బయట పడవచ్చు. అలా చేసినా కూడా ఈ లక్షణం మాత్రం అలాగే ఉంటే అప్పుడు దాన్ని గుండె జబ్బుగా అనుమానించాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. అలాగే హార్ట్ ఎటాక్ వచ్చే ముందు కళ్ల కింద బిళ్లలాగా వస్తాయి. వాటిల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోయి అలా బిళ్లల మాదిరిగా కనిపిస్తాయి. ఇలా ఉంటే చాలా డేంజర్. వీరికి అతి త్వరలోనే హార్ట్ ఎటాక్ వస్తుందని గుర్తించాలి. వెంటనే చికిత్స తీసుకోవాలి.

ఛాతిపై బరువు పెట్టినట్లు..

రక్త సరఫరా సరిగ్గా జరగకపోవడం వల్ల కళ్లు వాపులకు గురై నొప్పులుగా ఉంటాయి. అసలు ఏం చేసినా ఈ నొప్పి తగ్గదు. ఈ నొప్పి అంతకంతకూ పెరిగిపోతుంటే వెంటనే హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. అదేవిధంగా కొందరికి కంటి చూపు కూడా పోయే ప్రమాదం ఉంటుంది. ఇలా గనక జరిగితే దాన్ని కచ్చితంగా గుండె సమస్యగా అనుమానించాలి. ఇక హార్ట్ ఎటాక్ వచ్చే ముందు ఛాతిలో బరువుగా ఉంటుంది. ఛాతిపై పెద్ద బరువు పెట్టినట్లు అనిపిస్తుంది. శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా ఉంటుంది. అలాగే అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా మారుతుంది. ముఖ్యంగా మెట్లు ఎక్కేటప్పుడు లేదా దిగేటప్పుడు ఈ విధంగా అనిపిస్తుంది. ఇలాంటి లక్షణాలు కచ్చితంగా హార్ట్ ఎటాక్‌కు సంబంధించినవే. కనుక ఇవి కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు.

ఎడమ వైపు నొప్పి ఉంటే..

చాలా మందికి గ్యాస్ నొప్పికి, ఛాతిలో వచ్చే గుండె నొప్పికి తేడా తెలియదు. గ్యాస్ నొప్పి వచ్చి పోతూ ఉంటుంది. కానీ గుండె నొప్పి వస్తే అసలు తట్టుకోలేరు. సూదులతో పొడిచినట్లు వస్తుంది. అలాగే ఆ నొప్పి ఎడమ దవడ నుంచి ఎడమ భుజం మీదుగా ఎడమ చేయి కిందకు వ్యాప్తి చెందుతుంది. ఇలా గనక జరిగితే కచ్చితంగా దాన్ని గుండె పోటుగా భావించాలి. లేదంటే గుండె పోటు రాబోతుందని అర్థం చేసుకోవాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. ఇలా కొన్ని రకాల సూచనలు హార్ట్ ఎటాక్ కు ముందు లేదా హార్ట్ ఎటాక్ వచ్చేందుకు కొన్ని రోజుల ముందుగానే కనిపిస్తాయి. వీటిని జాగ్రత్తగా పరిశీలిస్తే ప్రాణాంతకం కాకుండా అడ్డుకోవచ్చు. దీంతో ప్రాణాలను నిలుపుకోవచ్చు.

ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా అయితే మీ లివర్ ప్రమాదంలో పడిందని అర్థం



మన శరీరంలో అంతర్గతంగా ఉండే అవయవాల్లో లివర్ కూడా ఒకటి. ఇది సుమారుగా 800కు పైగా జీవక్రియలను నిర్వహిస్తుందని వైద్యులు చెబుతున్నారు. మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేస్తుంది. మనకు శక్తి అందేలా చూస్తుంది. శరీరంలోని కొవ్వును కరిగిస్తుంది. వ్యర్థాలను బయటకు పంపుతుంది. అయితే ప్రస్తుతం చాలా మంది లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. చిన్న వయస్సులో ఉన్నవారికి కూడా ఫ్యాటీ లివర్ సమస్య వస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అయితే లివర్‌లో కొవ్వు చేరినా, ఇతర కారణాల వల్ల లివర్ డ్యామేజ్ అయినా మన శరీరం మనకు పలు సూచనలను తెలియజేస్తుంది. ఆ లక్షణాలను బట్టి మన లివర్ పాడైందని అర్థం చేసుకోవాలి. ఇక లివర్ డ్యామేజ్ అయినప్పుడు మన శరీరం ఎలాంటి సంకేతాలను చూపిస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

పాదాల వాపులు..

లివర్ పనితీరు సరిగ్గా లేనప్పుడు శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతుంటాయి. ముఖ్యంగా అవయవాల్లో నీరు చేరుతుంది. దీంతో శరీరం వాపులకు లోనవుతుంది. కాళ్లలో, పాదాల్లో వాపులు వస్తాయి. మడమల దగ్గర వాపులు కనిపిస్తాయి. వేలితో నొక్కితే చర్మం లోపలికి పోతుంది. ఈ లక్షణం గనక కనిపిస్తుందంటే లివర్ పాడైందని అర్థం చేసుకోవాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. అలాగే లివర్ డ్యామేజ్ అయిన వారికి పచ్చ కామెర్లు వస్తాయి. దీంతో చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారుతాయి. అయితే కామెర్లు వచ్చినంత మాత్రాన లివర్ డ్యామేజ్ అయిందని కాదు. కానీ కామెర్లు కనిపిస్తే మాత్రం అజాగ్రత్త చేయకూడదు. అది లివర్ డ్యామేజ్‌కు సూచన కూడా అయి ఉండవచ్చు. కనుక ఈ లక్షణం కనిపించినా కూడా అనుమానించాల్సిందే.

చర్మం కాంతిలో మార్పు..

లివర్ డ్యామేజ్ అయినప్పుడు లేదా లివర్‌లో కొవ్వు పేరుకుపోయినప్పుడు చర్మం మెరిసినట్లు కనిపిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను లివర్ బయటకు పంపలేదు. అందువల్ల చర్మం అలా కనిపిస్తుంది. ఈ లక్షణం కనిపిస్తున్నా కూడా జాగ్రత్త పడండి. అదేవిధంగా లివర్ డ్యామేజ్ అయితే కాళ్లలో రక్తనాళాలు సాలె పురుగుల మాదిరిగా బయటకు కనిపిస్తాయి. ఇక శరీరంలో ఏ భాగంలో అయినా సరే సులభంగా గాయాలు అవుతున్నా, తరచూ దురద వచ్చి దద్దుర్లు కనిపిస్తున్నా లివర్ డ్యామేజ్ అయిందని అర్థం చేసుకోవాలి. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నవారిలో సైతం ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి.

గోళ్ల రంగు..

లివర్‌లో ఏదైనా సమస్య ఉంటే గోళ్లు కూడా రంగు మారుతాయి. గోళ్ల మీద తెలుపు రంగు మచ్చలను గమనించవచ్చు. లేదా గోళ్లు పసుపు రంగులోకి మారిపోతాయి. అలాగే నడుస్తున్నప్పుడు కాళ్లలో అసౌకర్యంగా ఉంటుంది. సరిగ్గా నడవలేకపోతుంటారు. ఈ లక్షణాలు ఎవరిలో అయినా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. లివర్‌కు సంబంధించిన అన్ని పరీక్షలను చేయించుకోవాలి. దీంతో లివర్ సరిగ్గా పనిచేస్తుంది లేనిదీ తేలిపోతుంది. ఫలితంగా ఏదైనా సమస్య ఉంటే వెంటనే చికిత్స తీసుకోవచ్చు. దీని వల్ల లివర్ పూర్తిగా దెబ్బతినకుండా ఉంటుంది. ప్రాణాంతకం కాకుండా ముందుగానే మనల్ని మనం రక్షించుకోవచ్చు.

సృజనాత్మకథలో సంస్కరణాతకత



వాస్తవికతను కలిగిన గద్య కల్పిత గాథను 'కథ' అంటారు. తెలుగులో కథలు వచ్చినంతగా కథా విమర్శ లేదని అందరూ అంగీకరిస్తారు. కథా నిర్మాణంలో వస్తువు, భాష, శైలి, శిల్పం, ఇతివృత్తం, పాత్రలు, సన్నివేశ చిత్రణ, సంభాషణలు, రచయిత గొంతు వంటి ఇత్యాది అంశాల్లో 'వాస్తవికత, కల్పితాంశం' అనేవి ప్రధానమైనవి. కథలో పాఠకునికి 'వాస్తవికత' అనేది మానవ జీవన సారూప్యతను కలిగిస్తే, 'కల్పితాంశం' అనేది మానవ భావోద్వేగ జ్ఞానాన్ని లోతుగా విస్తరించడానికి దోహదపడుతుంది. కథలో రచయిత కల్పిత స్థాయిని బట్టి కథలను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. వాస్తవికత లోపించిన ఊహాజనిత కథలు, తక్కువ కల్పితాంశం కలిగిన కథలు, కల్పితాంశం లోపించిన వాస్తవిక కథలు, వాస్తవికత, కల్పితాంశం సమపాళ్లలో కలిగి ఉన్న కథలు. కథ కూడా సృజనాత్మక ప్రక్రియేనని అందరూ ఒప్పుకుంటున్నా, నిజానికి కల్పితానికి, సృజనకు వ్యత్యాసం ఉన్నది. కథలో రచయిత ఊహకు సృజన అవసరమైనా, అది అక్కడే ఆగిపోతే దానిని 'కల్పితం' అంటారు. అలా కాకుండా ఊహను వాస్తవికంగా మార్చడానికి ప్రయత్నిస్తే దాన్ని 'సృజనాత్మకత' అంటారు. దీని ఆధారంగా కథలను వాస్తవిక, కల్పిత, సృజనాత్మక కథలుగా వర్గీకరించుకోవచ్చు. సృజనాత్మక కథల్లో సామాజిక ఆదర్శం ఉంటుంది. ఆదర్శం సామాజిక సంస్కరణను కోరుకుంటుంది. రచయిత ఊహలో కథాంశం స్వీయ లేదా సామాజిక సమస్య ప్రధానంగా, వాస్తవిక ప్రపంచంతో అనుసంధానమై పరిష్కారం కనుగొనడానికి దారిని అన్వేషిస్తున్నట్టుగా సృజనాత్మక శైలిలో ఉంటుంది. కల్పితాంశ కథలో కథకుడు తనతో పాటుగా పాఠకులను ఊహా ప్రపంచం వరకు మాత్రమే పరిమితం చేయగలడు. వారు మిథ్యా ప్రపంచ అవధులను దాటి వాస్తవిక ప్రపంచంలోకి అడుగుపెట్టలేరు. కాబట్టి, సృజనాత్మక కథల్లో 'సంస్కరణవాదం' ఉంటుంది. తెలుగులో మొదటగా వచ్చిన కథల్లో ఈ సంస్కరణవాదమే ప్రధానంగా కనిపిస్తుంది. తెలుగు కథలో కల్పితాంశం క్రమంగా సృజనాత్మకత వైపు పరిణామం చెందడంతోనే కల్పితవాదం నుంచి, వాస్తవిక, సంస్కరణవా దం పరిణామం చెందింది. కల్పిత కథలుగా విక్రమార్క కథలు, దశకుమార చరిత్ర, పంచతంత్ర కథలు, కాశీమజిలీ కథలతో పాటుగా జానపద కథలు భారతీయ సాహిత్యంలో అచిరకాలంగా ప్రజల మన్నన పొందిన కథలు. కవి త్వం లాగే కథ కూడా కాలంతో పాటు పరిణామం చెంది సంస్కరణవాదం సామాజికవాదంగా మారింది. దీని ఫలితంగా తెలుగులో వచ్చిన కథలు సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులను ప్రతిబింబించే విధంగా రాయబడినాయి. అభ్యుదయ కథలు, విప్లవ కథలు, దళిత కథలు, స్త్రీవాద కథలు, మైనారిటీ కథలు, బహుజనవాద కథలు, ప్రాంతీయ, అస్తిత్వ ఉద్యమాల నేపథ్యం ఉన్న కథల వంటి అనేక రకాల సంస్కరణ ప్రధానంగా కథా సాహిత్యం వచ్చింది. అయితే, కథా సాహిత్యంలో ఉన్నంతగా సంస్కరణవాదమనేది కవిత్వంలో కనిపించదు. కల్పనలో సంస్కరణవాదమనేది సామాజిక మార్పును ప్రోత్సహించడానికి ఒక సృజనాత్మక కళాసాధనం. గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' కథలో వేశ్యాలోలుడైన భర్తను భార్య కాపాడుకోవడం, బండారు అచ్చమాంబ రాసిన 'ధన త్రయోదశి' కథలో దురాశకు లొంగకుండా ఉండటం కథాంశాలు. సురవరం ప్రతాపరెడ్డి వెట్టిచాకిరికి వ్యతిరేకంగా 'సంఘాల పంతులు' కథను రాశాడు. చెరబండరాజు రాసిన విప్లవ కథ 'చిరంజీవి'. పోలీసు వ్యవస్థను విమర్శిస్తూ, నక్సలిజానికి సానుభూతిగా ఈ కథను రాశాడని ఉమ్మడి ఏపీలోని శాసనసభలో హోంమంత్రి చదివి, ఈ కథను ప్రభుత్వం నిషేధించినట్టుగా ప్రకటించారు. నెల్లూరి కేశవస్వామి కథలు పూ్యడల్ సమాజానికి 'యుగాంతం' పలికిన కథను, మతంతో సంబంధం లేని 'కేవలం మనుషులం' వంటి కథలను రాశారు. పీవీ నరసింహారావు రాసిన 'గొల్ల రామవ్వ' కథ నిజాం వ్యతిరేక ఉద్యమ కాలం నాటి కథ. వెట్టిచాకిరి, శ్రమదోపిడీపై బోయ జంగయ్య రాసిన 'ఎచ్చరిక', గ్రామీణ దోపిడీ, అణచివేత ప్రధానంగా అల్లం రాజయ్య రాసిన 'ఎదురు తిరిగితే' వంటివి అభ్యుదయ కథలు. విప్లవ సాహిత్య అవగాహనలో బహుజన, దళిత జీవన తాత్వికతతో కథలు రాసిన వారు బీఎస్ రాములు. 'పాలు' కథలు తెలంగాణ సామాజిక పరిణామాన్ని వివరించే కథలు. తెలంగాణలో దళిత కవిత్వం వచ్చినంతగా కథలు రాలేదనే విమర్శ ఉన్నది. ఈ లోటును గుడిపల్లి నిరంజన్ సంపాదకీయంలో 'తెలంగాణ దళిత కథలు', ప్రతీ ఏటా వచ్చే 'కథా వార్షికలు' ఆ లోటును భర్తీ చేస్తున్నాయి. బోయ జంగయ్య 'పనిష్మెంట్' కథ, కాలువ మల్లయ్య 'వెలి' కథ, జూపాక సుభద్ర 'రామక్క మాన్యం', జాజుల గౌరి 'మన్ను బువ్వ' వంటి కథలతో దళిత స్త్రీలను చైతన్యవంతులను చేస్తే, ఇల్లిందల సరస్వతీదేవి, పాకాల యశోద 'ఎచ్చమ్మ కథలు', ముదిగంటి సుజాతారెడ్డి 'విసుర్రాయి', షాజహానా'సిల్ సిలా', 'లద్దాఖ్ని' వంటి వారు తమ కథల ద్వారా మహిళలను చైతన్యపరిచారు. ఓల్గా రచించిన 'అయోని' కథ స్త్రీ సంస్కరణవాద ఇతివృత్తంతో కూడిన కథ. ఇందులో పదేండ్ల బాలిక తన స్త్రీత్వంపై వ్యధాపూరిత ఆగ్రహం వ్యక్తం చేసిన సాంఘిక సంస్కరణవాదం శక్తివంతంగా కనిపిస్తుంది. పొట్లపల్లి రామారావు, వట్టికోట ఆళ్వారుస్వామి, కాంచనపల్లి చిన వెంకట రామారావు, ఆవుల పిచ్చయ్య లాంటి వారు కాల్పనికతకు దూరంగా, వాస్తవిక ఉద్యమ సంఘటనలను ప్రతిబింబిస్తూ కథలు రాశారు. గూడూరి సీతారాం సిరిసిల్ల కార్మికుల జీవితాలను, బహుజన జీవితాలను దేవులపల్లి కృష్ణమూర్తి 'కథల గూడు, తారుమారు' కథలలో, ఉప్పల నరసింహం 'సబ్బండ వర్గాల సారస్వతం' పేరుతో కథలను రాశారు. ఇవన్నీ సంస్కరణవాద కథలే. సంస్కరణవాద కథల్లో కల్పితాంశంతో రాసిన కథలు, సృజనాత్మకతతో రాసిన కథలున్నాయి. సృజనాత్మక కథల్లో ఊహాజనిత ప్రపంచం కనపడదు. వాస్తవిక జీవన సమస్యలు, సామాజిక సంవేదనలుంటాయి. సమాజంలోని కట్టుబాట్లను కాపాడే ఆదర్శం పట్ల నిరసన ఈ కథల్లో వ్యక్తం చేయబడి ఉంటాయి. అయితే సంస్కరణవాద కథల్లో హితబోధనం ప్రధానంగా ఉండి, కళాత్మకత శైలి లోపించడం వల్ల పాఠకులను ఆకట్టుకోలేని శైలి ఉంటుందనేది ప్రధాన విమర్శ. అయినప్పటికీ తెలుగు కథాకల్పనలో సామాజిక సంస్కరణవాదమే పైచేయి సాధించిందని నిరభ్యంతరంగా చెప్పవచ్చు.

రాజనీతితో పాటు సుభాషితం



'దానేన పాణిర్నతు కంకణేన/స్నానేన శు
ద్ధిర్నతు చందనేన/
మానేన తృప్తిర్నతు భోజనేన/జ్ఞానేన
ముక్తిర్నతు మండనేన'
దానం చేయడంతోనే చేతులు శోభిల్లుతాయి
కానీ, కంకణాలు ధరించడం వలన కాదు.
స్నానం వలననే దేహశుద్ధి అవుతుంది కానీ,
చందన లేపం వల్ల కాదు.
ఇచ్చే గౌరవంతోనే తృప్తి కలుగుతుంది కానీ,
భోజనం పెట్టడం వల్ల కాదు.
జ్ఞానం వల్ల ముక్తి లభిస్తుంది కానీ
తిలకాదులు ధరించడం వల్ల కాదు.
ఇది 'చాణక్య నీతిశాస్త్రమ్'లోని అధ్యాయం


17లోనున్న 12వ శ్లోకం.

చాణక్యుడి (క్రీ.పూ.350-275) అసలు పేరు విష్ణుగుప్తుడు. మగధ సామ్రాజ్యంలో జన్మించినాడు. ఇతడు చాణక్యుడూ, కౌటిల్యుడూ అనే పేర్లతోనే సుప్రసిద్ధుడు. చాణక్యుడు భారతీయతత్వవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా అగ్రగణ్యుడు. క్రీ.పూ.343-321ల మధ్య మగధరాజ్యాన్ని ఏలిన ఎనిమిది మంది రాజుల నందవంశ ప్రజాకంటక నిరంకుశ ప్రభుత్వాన్ని కూల్చేసి, యువకుడైన చంద్రగుప్త మౌర్యుడికి రాజగురువై శిక్షణ ఇచ్చి ఆతడిని మగధరాజ్య సింహాసనంపై రాజుగా అధిష్ఠింపజేసిన రాజకీయ మేధావి ఈ చాణక్యుడు. తన శిష్యుడు చంద్రగుప్తుడిని రాజుగా తీర్చిదిద్దడానికి ఆరు వేల శ్లోకాలు గల రాజకీయ 'అర్థశాస్త్రమ్'ను రచించి ఒక సామాన్యుడిని (చంద్రగుప్తుడిని) రాజుగా తయారుచేసిన దిట్ట (కింగ్ మేకర్)గా పేరుగాంచినవాడు ఈ చాణక్యుడు. తన రాజకీయ 'అర్థశాస్త్రమ్'లో ప్రపంచ ప్రఖ్యాతుడై మేధావులతో 'ప్లాటో', 'అరిస్టాటిల్', 'నికోలో మాకియ వెల్లి'లతోనూ పోల్చబడినాడు. అర్థశాస్త్రమే కాకుడా నీతిశాస్త్రమ్ కూడా రాసినట్టు చాలామందికి తెలియదు. నానా శాస్త్రాలను కూలంకషంగా అధ్యయనం చేసిన చాణక్యుడు- 'ప్రణమ్య శిరసా విష్ణుం త్రైలోక్యాధిపతిం ప్రభుం/ నానా శాస్త్రోద్ధృతం వక్ష్యే రాజనీతి సముచ్చయం' త్రిలోకాధిపతి, సర్వ వ్యాపకుడు, ప్రభువైన విష్ణువుకు ప్రణమిల్లుతూ నానాశాస్త్రాల నుంచి తీసుకున్న రాజనీతి, నీతి శ్లోకాలను సంకలనం చేసి చెప్తున్నాను- అంటూ 'చాణక్య నీతిశాస్త్రమ్'ను వెలువరించాడు. ఇది 'చాణక్య నీతి దర్పణం'గా కూడా పిలవబడుతోంది. ఈ గ్రంథంలో మొత్తం 17 అధ్యాయాలూ, 332 శ్లోకాలూ ఉన్నాయి. ఇందులో రాజనీతి శ్లోకాలు, సమాజహితం కోసం చెప్పిన శ్లోకాలూ ఉన్నాయి. వీటిలోని నీతులు చాలావరకూ సార్వకాలికాలైనా కొన్ని మాత్రం ఆ నాటి సమాజం వరకే పరిమితం. మానవుడు దీనిని యథాశాస్త్రంగా చదివితే ధర్మోపదేశ కార్యాకార్యాలు, మంచిచెడ్డలు అవగాహన చేసుకోగలదని వక్కాణించినాడు. దేనితో సర్వజ్ఞత్వం సిద్ధిస్తుందో అటువంటి నీతిని లోకహితం కోసం చెప్తున్నానన్నాడు.

'దుష్టాభార్యా, శఠం మిత్రం'

(అ. 1, శ్లో.5) అనే శ్లోకంలో మాటవినని భార్యా కుత్సితుడైన మిత్రుడు, ఎదురు మాట్లాడే సేవకుడు, విష సర్పం ఉన్న ఇంట్లో నివసించడం మృత్యువే అనడంలో సందేహం లేదంటాడు. ఏ ప్రాంతంలో ఆదరాభిమానాలు దొరక వో, ఏ వృత్తి దొరకదో, బంధువులుండరో, విద్యాభ్యాసానికి అవకాశం ఉండదో, ఆ ప్రాంతం నివాసయోగ్యం కాదనీ, వదిలిపెట్టాలని అంటాడు. (అ.1, శ్లో.8) ప్రతి పర్వతంలో మాణిక్యాలు దొరకవు. ప్రతి ఏనుగు కుంభస్థలంలో ముత్యాలూ ఉండవు. అన్ని చోట్లా సజ్జనులూ ఉండరని వివరిస్తాడు. (అ.2, శ్లో.9) అతి సౌందర్యవతి కావడం వల్ల సీత, అతి గర్వంతో రావణుడు, అతి దానంతో బలి చక్రవర్తి బంధితులైనారు. కనుక 'అతి సర్వత్ర వర్జయేత్' అంటూ, అతిని వదిలి పెట్టాలని చెప్తాడు. (అ.3, శ్లో.12) ధర్మం ధనంతో రక్షింపబడుతుంది, విద్య ధ్యానంతో రక్షింపబడుతుంది, మృదు స్వభావంతో రాజు రక్షింపబడుతాడు. ఇల్లు మంచి పనులతో రక్షింపబడుతుంది. అనే చెప్తాడు. (అ.5, శ్లో.9). దేశంలో చేయబడిన పాపాన్ని రాజు, రాజు చేసిన పాపాన్ని పురోహితుడు, భార్య చేసిన పాపాన్ని భర్త, శిష్యుడు చేసిన పాపాన్ని గురువు అనుభవిస్తారని వివరిస్తాడు. (అ.6, శ్లో.9) చెడు రాజ్యం ఉండటం కంటే రాజ్యం లేకపోవడం మేలు, చెడు స్నేహితుడు ఉండటం కంటే స్నేహితులు లేకపోవడం మేలు, చెడ్డ శిష్యులు ఉండటం కంటే శిష్యుడు లేకపోవడమే మేలు, చెడ్డ భార్య ఉండటం కంటే అసలు భార్య లేకపోవడమే మేలు అని చెప్పేస్తాడు. (అ.6, శ్లో.13) విప్రులు భోజనం చేసి, నెమళ్లు మేఘ గర్జన వినీ, సజ్జనులు ఇతరుల సంపదలను చూసి, పాపాత్ములు ఇతరుల కష్టాలు చూసి సంతోషిస్తుంటారు అంటూ ఇందులో లోకరీతిని విశదపరుస్తాడు. (అ.7,శ్లో.9) దేవుడు కొయ్యలోనో, రాతిలోనో, మట్టిలోనో ఉండడు. మన భావమునందే ఉంటాడు. దైవస్థితికి భావమే కారణం అని కటువైన నిజం చెప్తాడు. (అ.8, శ్లో.11) సంపార విష వృక్షానికి అమృతంతో సమానమైన రెండే ఫలాలు. ఒకటి సుభాషిత మాధుర్యాన్ని రుచి చూడటం, రెండు సజ్జన సాంగత్యం కలిగి ఉండటం అంటాడు. (అ.16, శ్లో.18) పంచ తంత్రానికి మూలమైన 'తంత్రాఖ్యాయిక (క్రీ.శ.300)లో చెప్పినట్టుగా రాజ గురువు, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడూ, వాచస్పతి, శుక్రుడూ, పరాశరాది ఋషుల సరసన స్మరించబడిన చాణక్యుని నీతిశాస్త్రమ్‌లో రాజనీతిని గురించీ, సమాజ సంస్కరణ గురించి చెప్పే ప్రతి శ్లోకం, నీతిబోధక సుభాషిత యుతం ప్రతివారికీ పఠనీయం.

సస్పెన్స్ మాస్టర్ సర్వస్వం



హిచ్‌కాక్ అంటే సినిమాకు నడకలు నేర్పిన దిగ్దర్శకుడు. సస్పెన్స్‌కు మారుపేరు. ఓ బ్రాండ్, ఓ ప్రపంచం. ఆయన తీసిన ఒక్కో సినిమా గురించి ఎంతైనా మాట్లాడుకోవచ్చు. ఎందరో దర్శకులకు ఆరాధ్యుడు. ఆయనను అనుసరించి ఎన్నో భాషల్లో, ఎన్నెన్నో సినిమాలు వచ్చాయి. సస్పెన్స్ సినిమాలకు హిచ్‌కాక్ గీటురాయి. మచ్చుకు 'సైకో', 'బర్డ్' ఆయన పేరు మీదే 'హిచ్‌కాక్ ప్రెజెంట్స్' అనే టీవీ షో సుదీర్ఘకాలం నడిచింది. అంతేకాకుండా 'హిచ్‌కాక్స్ మిస్టరీ మ్యాగజైన్' పేరిట ఓ పత్రిక కూడా వచ్చింది. చివరికి ఆయన జీవితం మీదే ఆంథోనీ హాప్కిన్స్ ప్రధాన పాత్రధారిగా 'హిచ్‌కాక్' అనే టైటిల్‌తోనే సినిమా వచ్చింది. అలాం టి దర్శక దిగ్గజం గురించి 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' అనే పుస్తకాన్ని తెచ్చిన పులగం చిన్నారాయణ, రవి పాడి చేసింది సాహసం అంటే చిన్నమాట అవుతుంది. నిజానికిది బయోగ్రఫీయో లేదా ఫిల్మోగ్రఫీ యో కాదు. హిచ్‌కాక్ సర్వస్వం ఇది. సిం గీతం శ్రీనివాసరావు వంటి దర్శకులు, వీఏకే రంగారావు వంటి పేరొందిన విమర్శకులు, రచయితలు, పాత్రికేయులు రాసిన వ్యాసాలు ఇందులో ఉన్నాయి. అందరూ అభిమానంగా, అపురూపంగానే రాశారు. అంతమంది రచనలను పోగు చేసి, అందంగా గుదిగుచ్చి అం దించారు సంపాదక ద్వయం. సినిమాల చుట్టూ అల్లుకున్న విశేషాలకైతే లెక్కేలేదు. వీటిని సినీ పరిభాషలో ట్రివియా అంటారు. బాపురే అనిపించే స్థాయిలో ఉన్నదీ పుస్తకంలోని సేకరణ. దీన్ని హడావుడిగా చదివి పక్కనపడేయొచ్చు. తాపీగా పూర్తి చేయవచ్చు. లేదా రిఫరెన్స్ గ్రంథంలా వాడుకోవచ్చు. హిచ్‌కాక్ తొలినాళ్లలో తీసిన సైలెంట్ మూవీస్‌తో సహా దేన్నీ వదిలిపెట్టకుండా సర్వ సమగ్రంగా తేవడానికి జరిపిన ప్రయత్నాన్ని అభినందించకుండా ఉండలేం. సినీ పబ్లిసిటీ ఆర్టిస్టుగా సుప్రసిద్ధుడైన ఈశ్వర్ రూపొందించిన అందమైన ముఖచిత్రం తో వెలువడిన 500 పైచిలుకు పేజీల ఈ ఉద్గ్రంథం తెలుగు సినీ సాహిత్యానికి ఓ కొత్త ఒరవడి దిద్దిందని చెప్పవచ్చు. హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, ఆయ న తొలి సినిమా వందేండ్లు పూర్తిచేసు కున్న సమయంలో ఈ పుస్తకం రావడం విశేషం.